విద్యార్థులకు కంటి పరీక్షలు

పుట్టపర్తి రూరల్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ సంయుక్తంగా రాష్ట్ర వ్యాప్తంగా బాల బాలికల సంరక్షణ కేంద్రాలలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తోందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీ సత్య సాయి జిల్లా శాఖ కార్యదర్శి విశ్వనాథ పేర్కొన్నారు. శనివారం స్థానిక మంగళకర ఎడ్యుకేషన్ చిల్డ్రన్ హోంలో బాల బాలికల కేంద్రంలో జగరాజుపల్లి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీ సత్యసాయి జిల్లా శాఖ, ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ సౌజన్యంతో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి జిబి. విశ్వనాథ, మంగళకర ట్రస్టీ సురేష్ కుమార్ , ప్రిన్సిపల్ బిందుజ, ఎల్ వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ కోఆర్డినేటర్ రఫిక్, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ బి.రమేష్, టెక్నీషియన్ కృష్ణ, మంగళకర సిబ్బంది, బాల బాలికలు పాల్గొన్నారు.

గాడితప్పిన రెవెన్యూ పాలన..!



హిందూపురం తహశీల్దారు కార్యాలయం

శ్రీ సత్యసాయి జిల్లాలోనే అతిపెద్ద పట్టణం, సెలక్షన్ గ్రేడ్ పురపాలక సంఘం హిందూపురం. 14 గ్రామ పంచాయతీలు, 16 రెవెన్యూ గ్రామాలు, 35 మజరా గ్రామాలు, ఒక మేజర్ గ్రామ పంచాయతీలో మండలం విస్తరించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాభా 1,51,677, రూరల్ మండల జనాభా 51,861, మొత్తం జనాభా 2,03,538. గడిచిన 13 సంవత్సరాల్లో జనాభా లక్షకు పైగా పెరిగివుండవచ్చని అంచనా. ఇంత పెద్ద మండలంలో రెవెన్యూ పాలన పూర్తిగా గాడితప్పింది. రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు పోస్టు గత ఏడాది ఆగష్టు నుంచి ఖాళీగా ఉంది. ఆర్ఐ, ఇతర పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. దీంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. సకాలంలో పనులు జరగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

అక్కడ అందరూ ఎఫ్ఎసిలే
కలెక్టర్ కార్యాలయంలో వారికి కొలువు
ఇబ్బంది పడుతున్న పురం ప్రజలు

హిందూపురం తహశీల్దారుగా రావాలంటే గతంలో పోటీ పడేవారు. ప్రస్తుతం ఇక్కడికి తహశీల్దారుగా రావాడానికి ఎవ్వరూ అసక్తి చూపడంలేదన్న చర్చనడుస్తోంది. ఇక్కడ రెగ్యులర్ తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న టి.శ్రీనివాసులు గత ఏడాది ఆగష్టు నెలలో సాధారణ బదలీల్లో భాగంగా వెళ్లారు. దీంతో చిలమత్తూరు తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న నాగరాజును అదనపు బాధ్యతల కింద (ఎఫ్ఎసి) హిందూపురం తహశీల్దారుగా నియమించారు. ఈయనను అదనపు బాధ్యత కింద పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయానికి పంపారు. ఇక్కడ మళ్లీ పోస్టు ఖాళీ ఏర్పడడంతో రీ సర్వే డిప్యూటీ తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న డి.ప్రసాద్‌ను జనవరి 14 నుంచి హిందూపురం ఇన్‌ఛార్జి తహశీల్దారుగా ప్రభుత్వం నియమించింది. ఇక్కడ ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న అమరేంద్రను పుట్టపర్తి జిల్లా కలెక్టర్ సిసిగా డిప్యూటేషన్ వేశారు. దీంతో లేపాక్షి మండల ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న భాస్కర్‌రెడ్డిని హిందూపురం ఆర్ఐగా డిప్యూటేషన్ విధానంలో నియమించారు. ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దారుగా రెండు నెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన మైనుద్దీన్‌ను పుట్టపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి డిప్యూటిటేషన్‌పై వేశారు. దీంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ హారతిని హిందూపురం మండలంతో పాటు మడకశిర, లేపాక్షి మండలాలకు ఇన్‌ఛార్జిగా నియమించారు. ఇలా హిందూపురం తహశీల్దారు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ముఖ్య అధికారులను ఇతర మండలాల కార్యాలయాలకు ఇన్‌ఛార్జిలుగా నియమిస్తుండడంతో ముఖ్య అధికారులైన తహశీల్దారు, ఆర్ఐ పోస్టుల ఖాళీలు ఏర్పడుతున్నాయి.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు..

నెలలు గడిస్తున్నా తహశీల్దారు, ఆర్ఐ పోస్టులు భర్తీ చేయకపోవడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా హిందూపురం తహశీల్దారు కార్యాలయానికి కుల, ఆదాయ, ఒబిసి, ఇబిసి ఇతర సర్టిఫికెట్ల కోసం సుమారు 4 వేల మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. మ్యూటేషన్, పాసుపుస్తకాలు తదితర పనుల కోసం రైతులు, రియలెస్టేట్ వ్యాపారుల దరఖాస్తులు వస్తుంటాయి. రియలెస్టేట్ వ్యాపారుల పనులు మాత్రం ఎఫ్ఎసిలుగా ఉన్నా వారే చకచకా చేసేస్తుంటారు. ఇతర పనులు మాత్రం తాము చేయలేమంటూ చేతులెత్తేస్తుంటారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హిందూపురం తహశీల్దారు కార్యాలయానికి రెగ్యులర్ అధికారులను నియమించి.. గాడితప్పిన పాలనను దారిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారుల నిర్లక్ష్యం..పింఛన్లకు దూరం..

హిందూపురం మండలం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి ఎంతోమంది సామాజిక పింఛన్లకు నోచుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. చాలామందికి 1000 చదరపు అడుగుల ఇల్లు ఉందని పింఛను నిలిపి వేశారు. 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం పేదలకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలను కేటాయించింది. పైసా పైసా కూడబెట్టుకుని లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. ఒకే ఇంట్లోనే బాగాలు చేసుకుని కుమారులు నివాసముంటున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన నిబంధనలతో మేల్కొన్న పేదలు వారికి కేటాయించిన స్థలాన్ని భాగ పరిష్కారం చేసివ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు సమస్యలను పరిష్కరించక పోవడంతో చాలామంది సామాజిక పింఛన్లకు దూరమయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ తదితరులు

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

6న కలెక్టరేట్ ఎదుట మహాధర్నాను జయప్రదం చేయండి
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, దీర్ఘ కాలిక సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శకుంతల, రమాదేవి డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6వ తేదీన కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విధానాలతో అంగన్‌వాడీ సెంటర్లను నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తున్నాయని తెలిపారు. సంవత్సరాల కొద్దీ టీఏ బిల్లులు పెండింగ్‌లో ఉండడం, పర్మినెంట్ బిల్డింగ్ లేక అద్దెలు చెల్లించలేక అంగన్‌వాడీ వర్కర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఇస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. 4 సంవత్సరాలు గడిచినప్పటికీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఫేస్ యాప్ హాజరు ఉపసంహరించాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పార్టీ ప్రతిష్టను పెంచేలా పనిచేయాలి

చిలమత్తూరు : పదవి పెత్తనం కోసం కాదని పార్టీ ప్రతిష్టతను పెంచడానికి అని ఎమ్మెల్సీ ఇక్బాల్ అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని గృహసారథులు, సచివాలయా కన్వీనర్లు, వాలెంటీర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన వారికి పలు సూచనలు చేశారు. నూతనంగా పార్టీ నియమించిన గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు తమ పదవిని పెత్తనం కోసం కాకుండా వాలెంటీర్లను, సచివాలయ ఉద్యోగులను సమన్వయం చేసుకొని పార్టీ ప్రతిష్ట పెంచేలా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అనూషా, మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, వైస్ ఎంపిపి బయన్న, అంజలీదేవి, సర్పంచులు ఈడిగ తిరుమలేష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: గృహ సారథులు, వాలెంటీర్లు వైసిపికి వెన్నెముక లాంటి వారు అని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి రూరల్ పరిధిలోని గృహసారథులు, వాలెంటీర్లకు స్థానికవైసీపీ కార్యాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ కన్వీనర్ రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన శిక్షణ తరగతులలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎవి. రమణారెడ్డి, సచివాలయాల కన్వీనర్ మల్లికార్జున, జిల్లా ఏడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఈశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రంగన్న, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : రాబోయే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే డి. శ్రీధర్ రెడ్డి తెలిపారు కొత్తచెరువులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సచివాలయ కన్వీనర్లు గృహసారథులు, వాలెంటర్లు, వైసీపీ నాయకులు కార్యకర్తలతో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను 90శాతం నెరవేర్చారన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటా తిరిగి ప్రజలకు వివరించాలని సూచించారు. అర్హులై ఉండి పథకాలు అందకుంటే వారికి తిరిగి పథకాలు అందే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ గాయత్రి రెడ్డప్ప రెడ్డి, జెడ్పీటీసీ గంగాదేవి, సర్పంచి రాధా నాగరాజు, వైసిపి నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, సాంబశివరెడ్డి, ముద్దుల భాస్కర్, గిరిబాబు, రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రైతు భరోసా కేంద్రాలతో ఎఫ్‌పిఒలను అనుసంధానం చేస్తాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి

రైతు ఉత్పత్తిదారుల సంస్థలను (ఎఫ్‌పిఒలు) రైతు భరోసా కేంద్రాలతో అనుసంధానం చేసి రైతాంగానికి మరింత చేరువయ్యేలా చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్డీటీ ప్రత్యక విద్యార్థుల పాఠశాలలో నిర్వహించిన రాయలసీమ రైతు ఉత్పత్తిదారుల సంస్థల సమ్మేళనానికి మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు నిర్వహించుకునే ఎఫ్‌పిఒలు బలపడినప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఎఫ్‌పిఒలు అంతర్జాతీయ స్థాయిలో ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నిరుపయోగంగా ఉన్న మార్కెట్ కమిటీల స్థలాలు, నిల్వ వసతులను ఎఫ్పీవోలు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. వేర్ హౌస్‌ల ఏర్పాటు కోసం ఎఫ్‌పిఒలకు సబ్సిడీ పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వమే తయారు చేసిన మార్కెఫ్ బ్రాండ్ ద్వారా ఎఫ్‌పిఒల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తామన్నారు. త్వరలోనే రాష్ట్రంలో రూ.1250 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాట్లకు నిర్మాణాలు ప్రారంభించనున్నామన్నారు. సూక్ష్మ సేద్యం విషయంలో అనంత జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

అంగన్ వాడీల్లో చిరుధాన్యాల ఆహారం అందిస్తాం

స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా పిల్లలు, గర్భిణులకు చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని అంగన్‌వాడీల ద్వారా అందించే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. జిల్లాలో ఎఫ్‌పిఒలు బలంగా ఉన్నాయన్నారు. మరింత అభివృద్ధి చెందాలన్నారు. ముఖ్యంగా మహిళలు నిర్వహించే ఎఫ్‌పిఒల పనితీరు బాగుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రితో పాటూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, కోఆపరేటివ్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో శ్రీధర్‌రెడ్డి, ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, ఏడీసీసీ చైర్‌పర్సన్ లిఖిత, నాటక అకాడమీ చైర్ పర్సన్ హరిత, ఆర్టీసీ రీజనల్ చైర్ పర్సన్ మంజుల, ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, రమణారెడ్డిలు, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్, జిల్లా ఉద్యాన అధికారి రఘునాథరెడ్డి, ఎఫ్‌పిఒల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

కల్తీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం

కల్తీ, నాసిరకం పత్తి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ ఇవ్వాలని సిపిఎం, ఎపి రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డిలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి పంట 70 వేల హెక్టార్లలో విస్తారంగా సాగు చేశారన్నారు. గత ఏడాది పత్తి పంటకు మంచి ధర రావడం వల్ల ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం బాగా పెరిగిందన్నారు. ఎప్పుడూ లేనివిధంగా సాగు పెరగడంతో పత్తి విత్తన కంపెనీలు రైతుల అవసరాలను ఆసరా చేసుకుని నాసిరకం నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను నిలువు దోపిడీ చేశారన్నారు. జిల్లాలోనే కాకుండా తెలంగాణ ఇతర ప్రాంతాల నుంచి అనేక రకాల నాసిరకం విత్తనాలు రైతులకు విక్రయించారని తెలిపారు. రైతులు రూ.350 కోట్ల మేరకు పెట్టుబడుల రూపంలో నష్టపోయారని తెలిపారు. అధికారుల చలువతోనే నకిలీ విత్తనాలు వస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారని తెలిపారు. ఈ వాదనకు బలం చేకూర్చే విధంగా నకిలీ విత్తన కంపెనీలపై వ్యవసాయ శాఖ అధికారులు ఒక్క చోట కూడా దాడులు చేసి, చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. జిల్లాలో నాసిరకం పత్తి విత్తనాల వల్ల పామిడి, పెద్దవడుగూరు, యాడికి, తాడిపత్రి, కొనుగట్టపల్లి, దిగువపల్లి, ఎగువపల్లి, బందార్లపల్లి, బాపణపల్లి, తిమ్మేపల్లి, తిమ్మాపురం, తేరన్నపల్లి, పెద్దమడమల తదితర గ్రామాలు, ఇతర ప్రాంతాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం ముందస్తుగా విత్తన కంపెనీలపై చర్యలు తీసుకుని ఉంటే ఇంత నష్టం జరిగి ఉండేది కాదన్నారు. ప్రభుత్వం పరిశీలించి నకిలీ నాసిరకం పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. పత్తి, పప్పుశెనగ, మిరప పంటలను వైఎస్ఆర్ ఉచిత పంటల బీమాలో చేర్చాలన్నారు. పత్తి మిరప నష్టపోయిన పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రైతు భరోసా కేంద్రాల ద్వారా పత్తి, మిరప, ఇతర రకాల పంటల విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందించాలని కోరారు. స్పందించిన మంత్రి అధికారులతో పరిశీలన చేయించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం, రైతు సంఘం నాయకులు

వేగవంతంగా ఇళ్ల నిర్మాణం : కలెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పెనుకొండ : ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని కలెక్టర్ బసంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని జగనన్న హౌసింగ్ లేఅవుట్‌ను కలెక్టర్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కింద జగనన్న హౌసింగ్ లే అవుట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. పెనుకొండ పరిధిలో జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో 1,915 ఇళ్లు మంజూరుకాగా 400 గృహ నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన వాటిని వేగవంతం చేయించాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్, డీఈ శంకర్‌లాల్, ఏఈ శ్రీనాథ్, ఎంపిడిఒ శివశంకరప్ప, తహశీల్దార్ స్వర్ణలత, మున్సిపల్ కమిషనర్ వంశీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి : మండలంలోని మేడాపురం వద్దనున్న జగనన్న హౌసింగ్ లేవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన శనివారం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణంలో మరింత వేగం పెంచాలని, సంబంధిత లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్, డీఈ శంకర్‌లాల్, ఏఈ హరినాయక్, ఎంపిడిఒ అశోక్ నాయక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్ పాదయాత్ర అంటే వైసిపికి వణుకు : టిడిపి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారాలోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రను చూసి వైసీపీ నాయకుల్లో వణుకు మొదలైందని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నాయకులు, పోలీసులు చేసే తాటాకు చప్పుళ్లకు నారాలోకేశ్ అడుగులు ఆగవని అన్నారు. శుక్రవారం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో జరిగిన ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. లోకేశ్ పాదయాత్రకు సవాలక్ష నిబంధనలు పెట్టారన్నారు. అన్ని అనుమతులు తీసుకుని యాత్ర చేస్తున్నా ఇబ్బందులు పెడుతున్నారంటే ఆయనంటే వైసిపికి ఎంత భయమో అర్థమవుతోందన్నారు. లోకేశ్ పాదయాత్ర బంగారుపాళ్యం వేరుకోగానే విద్యుత్ నిలిపివేశారని, 3 వాహనాలు సీజ్ చేశారన్నారని అన్నారు. పోలీసులు యువగళం వలెంటీర్లను హింసిస్తున్నారని ఆరోపించారు. లోకేశ్ సభలు నిలిపివేయడం, మైకు లాగేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఎవరోచెప్పిన మాటలు విని డీఎస్పీ నారాలోకేశ్ పాదయాత్రకు అడ్డంకులు సృష్టిస్తే న్యాయస్థానంలో దోషిగా నిలబడక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, చింతలపల్లిమహేశ్ చౌదరి, చింతవులును పెద్దన్న, పురుషోత్తం గౌడ్, నాగూర్ ఉస్సేన్, రాంపురంశీన, చిగిచెర్ల రాఘవరెడ్డి, గోసల శ్రీరాములు, కేశగాళ్ల శీన, మాబు, తోటవాసుదేవ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల : నారాలోకేశ్ యువగళం పాదయాత్ర వారంరోజుల్లో వందకిలోమీటర్లు చేరుకున్న నేపథ్యంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్. ఐటీడీపీ నాయకులు పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలేశ్, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కర్మాద్. సోషియల్ మీడియా పార్లమెంట్ కో ఆర్డినేటర్ తోటవాసుదేవ, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు సురేశ్, పట్టణ అధ్యక్షుడు చెలిమిశివరాం, నాయకులు నాగేంద్ర, తొగట అనిల్ తదితరులు పాల్గొన్నారు.

యువగళం పోస్టర్లు విడుదల చేస్తున్న పరిటాల శ్రీరామ్, తదితరులు

ఉపాధ్యాయుల పనితీరుపై ఆగ్రహం

విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

ప్రజాశక్తి గుడిబండ

మండల పరిధిలోని బూదిపల్లి ప్రాథమిక పాఠశాల, మోరుబాగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం తనిఖీ చేసిన రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బూదిపల్లి పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలను తనిఖీ చేసి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆయన ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలతో సహ బోధనకు సంబంధించిన వివిధ పుస్తకాల పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా మోరుబాగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వంపంపిణీ చేసిన ట్యాబ్లను పరిశీలించి విద్యార్థులను ఆపరేటింగ్ చేయాలని కోరారు. వారు సక్రమంగా ఆపరేటింగ్ చేయకపోవడంతో ఉపాధ్యాయులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సక్రమంగా ఆపరేటింగ్ చేసే విధంగా ఉపాధ్యాయులు చూడాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి ట్యాబ్లు పంపిణీ చేస్తే వాటిని సక్రమంగా ఉపాధ్యాయులు ఆపరేటింగ్ చేయించకపోతే ఎలా అని ప్రశ్నించారు. అదేవిధంగా విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ మీనాక్షి, పెనుగొండ డిఇఒ రంగస్వామి, ఎంఇఒ శ్రీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సత్యసాయిజిల్లా హాకీ జట్టుకు కాంస్యపతకం

కాంస్య పతకం కైవసం చేసుకున్న హాకీ జట్టు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడలో జరుగుతున్న రాష్ట్రస్థాయి శాప్ హాకీ లీగ్ (అండర్-19) పోటీల్లో సత్యసాయి జిల్లా జట్టు కాంస్యపతకం సాధించినట్లు జిల్లా హాకీ ముఖ్యశిక్షకుడు జగన్నాథ్ రెడ్డి, కోచ్ హస్సేన్ తెలిపారు. మొదటి లీగ్ మ్యాచ్లో అనకాపల్లి జిల్లా జట్టుపై సత్యసాయి జిల్లా జట్టు 1-0 గోల్ తేడాతో విజయం సాధించిందన్నారు. అనంతరం లీగ్ మ్యాచ్లో సత్యసాయి జిల్లా తిరుపతి జిల్లా జట్టుతో తలపడి 0-0 స్కోర్‌తో డ్రా చేసిందన్నారు. అనంతరం సెమీఫైనల్లో కాకినాడ జిల్లా జట్టుతో తలపడి 1-0 గోల్స్ తేడాతో పరాజయం పాలైందన్నారు. మూడవస్థానం కోసం జరిగిన మ్యాచ్లో పెనాల్టీ షూటౌట్లో నెల్లూరు జిల్లా జట్టుపై సత్యసాయిజిల్లా జట్టు 1-2 గోల్స్ తేడాతో విజయం సాధించి కాంస్యపతకం సాధించిందన్నారు. దీంతో జిల్లా ముఖ్యశిక్షకుడు జగన్నాథరెడ్డి, హాకీ కోచ్ హస్సేన్, ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రసిడెంట్ సూర్యప్రకాశ్, సీనియర్ క్రీడాకారులు కాంస్యపతకం సాధించిన జట్టుసభ్యులను అభినందించారు.

కవాతు నిర్వహిస్తున్న ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు

ధర్మవరంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు కవాతు

ధర్మవరం టౌన్ : ప్రజాభద్రత, విశ్వాసాలకు భరోసానిస్తూ జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు శనివారం ధర్మవరం పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాల కవాతు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమై కళాజ్యోతి, ఎన్టీఆర్, గాంధీసర్కిల్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో హాకీంపేట 99వ బెటాలియన్ ర్యాపిడ్ యాక్షన ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ వినోద్, వన్ టౌన్, టూటౌన్ సిఐలు సుబ్రమణ్యం, రాజా, ట్రాఫిక్ సిఐ వహీద్‌బాషా, ఎస్ఐలు మహమ్మద్ రఫీ, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక మద్యం స్వాధీనం

రొద్దం : కర్నాటక నుంచి అక్రమంగా తీసుకువస్తున్న కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం మండలంలోని నల్లూరు గ్రామంలో చోలేమర్రి వెళ్లే రోడ్డులో ఉన్న కాలనీలో విక్రయిస్తున్న కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాగరాజు, సిద్దప్ప అనే వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 94- ఒరిజినల్ ఛాయస్, డీలక్స్ విస్కీ 90 ఎంఎల్ పాకెట్లు, 10- ఓల్డ్ అడ్మిరియల్ బాటిళ్లతో పాటు మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

లేపాక్షి : ప్రయివేటు సంస్థలకు ఇప్పించుకున్న పేదల భూములను తిరిగి ఇవ్వాలని మండలంలోని కొండూరు, కొర్లకుంట గ్రామస్తులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. గ్రామానికి చెందిన బాధితులు దాదాపు 30 మంది ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నామన్నారు. అలాంటి తమ భూములను ప్రయివేటు సంస్థలకు ఇప్పించి తమకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే తమకు ఇంతవరకు ఎలాంటి ఉపాధి కల్పించలేదన్నారు. తమ భూములు తమకు ఇప్పించాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ ఎస్ఒఐగా సుమో శీనాకు అవార్డు

ధర్మవరం టౌన్ : సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్ (ఎస్ఒఐ) గా ధర్మవరం ఆర్టీసీ డిపోకు చెందిన సుమోశీనాకు ఉత్తమ అవార్డు లభించింది. ఈ మేరకు హిందూపురంలో శుక్రవారం జరిగిన రోడ్డుభద్రతా వారోత్సవాలలో భాగంగా సుమోశీనకు ఆర్టీసీ జోనల్ చైర్మన్ మాల్యవంతం మంజుల, డిప్యూటీ సిఎంఇ మోహన్‌కుమార్, హిందూపురం ఆర్టీవో ఎంవి రమణ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి డ్రైవర్ కృషి చేయాలని జోనల్ చైర్మన్ సూచించారు.

అవార్డు అందుకుంటున్న సుమోశీనా

నిరసనల ఆలోచన విరమించండి

ధర్మవరం టౌన్ : ఆక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో కాంగ్రెస్ ఈనెల 6న దేశవ్యాప్తంగాఉన్న అన్ని ఎస్ఐసీ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శనలు చేయాలన్న ఆలోచనలు విరమిం చుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ క్లాస్ 1 ఆఫీసర్స్ అసోషియేషన్ కడప డివిజన్ నాయకులు కోరారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లారెడ్డి, చంద్రపాల్, ఎన్ఎఫ్ఎఫ్ఎడబ్ల్యూఐ కడపడివిజన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, రాజశేఖర్లు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎల్ఐసి దేశంలో ఒక గొప్పసంస్థ అని, అటువంటి కార్యాలయం ఎదుట నిరసనలు నిర్వహించాలనుకోవడం భావ్యంకాదని అన్నారు. ఈ నిరసనలపై పునరాలోచించాలని వారు కోరారు.

ఆలయ పునర్‌నిర్మాణానికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని సిద్దయ్యగుట్టలో నున్న అతి పురాతన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం పునర్ నిర్మాణం కోసం శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి సంఘం అధ్యక్షురాలు జయశ్రీ, ఉపాధ్యక్షులు పుట్లూరు నరసింహులు, గడ్డం పార్థసారథి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ లింగం నిర్మల, కమిషనర్ మల్లికార్జున పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

హిందూపురం : పట్టణంలోని షఫ్ఫియా మసీదులో మదీన మెడికల్ ఏజెన్సీ, బ్లూ క్రాస్ ల్యాబోరేటరీ, వైద్యురాలు ఖదీజా షేక్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు ఖదీజాషేక్ వివిధ జబ్బులతో బాధపడుతున్న 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా ధీర్ఘకాలిక రోగాలైన బిపి, షుగర్‌తో భాధపడుతున్న రోగులకు బ్లూ క్రాస్ ల్యాబోరేటరీ వారు ఉచిత పరీక్షలు నిర్వహించారు. రోగులందరికి మదీన మెడికల్ ఏజెన్సీ వారు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆ కార్యక్రమంలో ముతవల్లి జావీద్ ఆలం, ఏజెన్సీ నిర్వహకులు రీయాజ్, మసీదు కమిటీ నిర్వహకులు ఉబేదుల్లా, ఫయాజ్, యుసూఫ్‌తో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

హిందూపురం : హిందూపురం వైసిపి ఇన్‌ఛార్జి ఇక్బాల్ చొరవతోనే పెన్న నది వంతెన వద్ద రోడ్డు నిర్మాణం జరుగుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. ఈ మేరకు ఆమె శనివారం పెన్నానది వద్ద జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బేవినహళ్లి సర్పంచి ఆనంద్, సుగూరు వీరా తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వంద శాతం పూర్తి చేయాలి

హిందూపురం : పురపాలక సంఘ వ్యాప్తంగా సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో పాటు ఇతర సెక్రటరీలు ఆయా వార్డుల పరిధిలో అన్ని రకాల పన్నులు నిర్దేశించిన గడువులోగా వంద శాతం వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. శనివారం మున్సిపల్ పరిధిలని నింకంపల్లి, తదితర వార్డు సచివాయాలను ఆయన తనఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్డు పరిధిలో వివిధ రకాల పన్నులను నిర్దేశించిన గడువులోగా వంద శాతం వసూలు చేయాలన్నారు. దీంతో పాటు రీ సర్వే పనులు వేగ వంతంగా పూర్తి చేయాలన్నారు. సచివాలయ సెక్రెటరీలు సమయపాలన పాటిస్తు, వచ్చిన ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని ఆదేశించారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

ధర్నాను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి- చిలమత్తూరు

అంగన్ వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల. 6న పుట్టపర్తిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి వెంకటేష్, అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు శోభారాణి కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక మండల కేంద్రంలోని కార్మిక, కర్షక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, పేస్ యాప్ రద్దు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం 6న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు రామచంద్ర, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వనజమ్మ, పద్మ, సుగుణ, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మోడ్రన్ కాలనీగా అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలోని మోడాల్ కాలనీని అన్ని విధాలా అభివృద్ధి చేసి మోడ్రన్‌గా కాలనీగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. శనివారం పురపాలక సంఘంలోని 11వ వార్డు మోడాల్ కాలనీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డిఇన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ జబివుల్లా, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వార్డు ఇన్‌ఛార్జి డిష్ చాంద, బాలు, కౌన్సిలర్లు అంజలి దేవి, రహమత్ బి, అయూబ్, ముస్తాక్, మల్లికార్జున, నాగేంద్రమ్మ, బాబు, కో-ఆప్షన్ రహమాత్, వైసిపి నాయకులు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్సీ

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ లో మల్టీ మెంబర్ అథారిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిసి, పిఎన్‌డిటి యాక్ట్‌ను కఠినంగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో హిందూపురం అడిషనల్ జడ్జి కె. శైలజ, డిఎస్‌పి యశ్వంత్, డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ తిప్పేంద్ర నాయక్, అనంతపురం న్యాయ సలహాదారులు ఆశాలత, ఆర్‌డిటి హెల్త్ డైరెక్టర్ సిర్రప్ప, డెమో బాబాఫక్రుద్దీన్, ఎడ్యుకేషనల్ ఆఫీసర్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ కాలం విలువ తెలుసుకోవాలి

విద్యార్థికి ల్యాబ్‌టాప్ అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి విద్యార్థి కాలం విలువ తెలుసుకుని, ఆ కాలంతో సమానంగా సాగితే విజయం వారి వెంటే ఉంటుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పట్టణంలోని బాలయేసు జూనియర్ కళాశాలలో 2021-22 విద్యా సంవత్సరంలో జూనియర్ ఇంటర్‌తో పాటు జెఈఈ, ఇతర పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కళాశాల పరిపాలన అధికారి శౌరిరెడ్డి అధ్యక్షతన ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్‌ఛైర్మన్, కళాశాల ప్రిన్సిపల్ బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అజ్ఞానం కన్నా నిర్లక్ష్యం చాలా ప్రమాదకరమైందన్నారు. పేస్ బుక్ కన్నా క్లాస్ బుక్ వల్ల జ్ఞానం పెరుగుతుందన్నారు. అనంతరం సీనియర్ ఇంటర్ విభాగంలో 980 మార్కులు సాధించిన మానసకు ల్యాప్ ట్యాప్ అందించారు. ప్రతిభ కనపర్చిన మిగిలిన వారికి నగదు బహుమతులు, జ్ఞాపికలు, పతకాలు అందించారు. అనంతరం ఉత్తమ అధికారిగా ప్రశంశలు పొందిన మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావును కళాశాల తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ రెడ్డి, రామమోహన్ రెడ్డి అధ్యాపకులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో యువతకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి కదిరి టౌన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి గూడూరు ఆంజనేయులు విమర్శించారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర విజయవంతమైన నేపథ్యంలో సంఘీభావంగా రాష్ట్రంలో యాత్రకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్లను ఈసందర్భంగా నాయకులు ఆవిష్కరించారు . ఈ కార్యక్రమంలో నాయకులు హరి ప్రసాద్ స్వామి, పిఎస్ అహ్మద్ హుస్సేన్, జంగా గౌతమ్, కెటి. శ్రీధర్, సుధాకర్, ఖాదర్ వలీ, అల్తాఫ్, భాస్కర్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

చేపల చెరువు వేలం

మడకశిర రూరల్ : మండలంలోని వైబి హళ్లి గ్రామపంచాయతీలో 2022 - 23 సంవత్సరానికి పెద్ద చెరువులో చేపలు పెంచుకోవడానికి వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతి కార్యదర్శి కృష్ణమూర్తి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ. 5వేలు ధారవత్తు చెల్లించాలన్నారు. చింత చెట్ల ఫలసాయానికి నిర్వహించే వేలం పాటలో పాల్గొనే వారు 15 వందల రూపాయలు చెల్లించాలన్నారు.

నేడు కదిరికి మంత్రుల రాక

కదిరి టౌన్ : కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు రానున్నట్లు సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి తెలిపారు. హోంమంత్రి తానేటి వనిత, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మనూరు జయరాంతో పాటు డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి రానున్నట్లు ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో భవన ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఎస్పీ ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, అడిషనల్ ఎస్పీ ఏర్పాట్లను పరిశీలించారు . ఈ సమావేశంలో డీఎస్పీ భవ్య కిషోర్, పట్టణ సిఐ తమ్మిశెట్టి మధు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

నంబులపులకుంట : మండలపరిధిలోని మేకల చెరువు గ్రామంలోని అరవ వాండ్ల పల్లిలో కందిపంటకోత ప్రయోగాలను శనివారం నిర్వహించారు. గ్రామంలోని మౌలా ఖాన్, సురేంద్ర రెడ్డి అనే రైతుల పొలంలో పంట దిగుబడి అంచానా వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి విజయ్ కుమార్, డివైఎస్ఒ శివనాయక్, ఎఎస్ఒ గంగాద్రి, విఆర్ఒ శకుంతల, విఎఎ హరినాథ్ రెడ్డితో పాటు రైతులు కొండారెడ్డి,లక్ష్మి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

పోలీస్ డైరీ ఆవిష్కరణ

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ ఆఫీసర్స్ 2023 పోలీస్ డైరీని జిల్లా అదనపు ఎస్పీ కెవి. రామకృష్ణ ప్రసాద్ శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీస్ అధికారుల సంఘం ఆడ్ హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, తేజ్‌పాల్, ఎఆర్‌డిఎస్‌పి విజయ్ కుమార్, ఆర్ఐ టైటాష్, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

బుక్కపట్నం : మండల కేంద్రంలో అర్థాంతంగా ఆగిపోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవ నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ నటరాజ్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాయి గౌతమ్, హరి ప్రసాద్, సాయికృష్ణతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిని ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు శనివారం సన్మానించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, తేజ్‌పాల్, పుట్టపర్తి అర్బన్ సిఐ బాలసుబ్రమణ్యరెడ్డి, అడ్మిన్ ఆర్ఐ టైటాస్ తదితరులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. పుట్టపర్తి మున్సిపాలిటీని రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్ 2 మున్సిపాలిటీగా ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో వారు ఈసందర్భంగా ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. దీనివలన ఉద్యోగస్తులకు ఎంతో ప్రయోజనాలు ఉంటాయన్నారు.

సంకల్పదీక్షను విజయవంతంచేయండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

హిందూపురంలోని ఎన్జీవో హోంలో యుటిఎఫ్ . ఆధ్వర్యంలో ఆదివారం చేపడుతున్న ఒక రోజు దీక్షను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, నాగేంద్ర కోరారు. ఈ మేరకు వారు శనివారం ఒకప్రకటన విడుదల చేశారు. సిపిఎస్ రద్దుకోసం విజయవాడలో యుటిఎఫ్ తలపెట్టిన సంకల్పదీక్షను రాష్ట్ర ప్రభుత్వం భగ్నంచేసిందని అన్నారు. దీంతో యుటిఎఫ్ కార్యాలయంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు దీక్ష చేపట్టారన్నారు. వీరికి మద్దతుగా యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కూడా హిందూపురంలో తాము కూడా సంకల్పదీక్షను చేపట్టామన్నారు. కావున జిల్లాలోని ప్రతి మండలం నుంచి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, మండల అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చిన దీక్షను విజయవంతంచేయాలని వారు కోరారు.

సమాజసేవలో తోట శ్రీధర్

ప్రజాశక్తి, కదిరి టౌన్

కదిరి డిపోలో కండక్టరుగా విధులు నిర్వహిస్తున్న మొలకలచెరువు వాసి తోట శ్రీధర్ సమాజ సేవలో పలువురు నుండి ప్రశంసలు అందుకుంటున్నారని ఆయన సేవలు ప్రసంశనీయమని కదిరి ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజరు హరిమోహన్ తెలిపారు. తాను చదువుకున్న అన్నమయ్య జిల్లా మొలకలచెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పేద పిల్లలకు తన వంతు సహకారం అందించాలని ఉద్దేశంతో తన వేతనంలోని కొంత మొత్తాన్ని ప్రతి ఏటా దాదాపు 60 మంది పేద విద్యార్థుల వికాసానికి ఉపయోగపడే పుస్తకాలను అందజేస్తున్నారన్నారు. శ్రీధర్ తల్లితండ్రుల జ్ఞాపకార్థం ప్రతి ఏటా పేద విద్యార్థులకు రూ.30వేల ఆర్థికసాయం అందజేస్తున్నారన్నారు. అంతేకాకుండా డ్యూటిలో ఉత్తమ సంపాదన, రక్తదానం,సేవ కార్యక్రమములో శ్రీధర్ చురుకుగా పాల్గొంటూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు.

నోరు మెదపని నేతలు

కేంద్ర బడ్జెట్‌లో తీరని అన్యాయంపైనా గప్‌చుప్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లో ఉన్నాం...వారి బాగు కోసం జీవితాలను అర్పిస్తున్నాం...అంటూ ప్రకటనలు చేసే నేతలు... కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించి 2023-24 బడ్జెట్‌లో జిల్లాకు మంచి చేయకపోగా నష్టంచేకూర్చే నిర్ణయం తీసుకున్నా నోరు మెదపటం లేదు. నిత్యం క్షామ పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాకు ఏకైక జలవనరుగానున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నష్టం జరిగే పరిస్థితి కనిపిస్తున్నా... నేతలెవరూ ఇది అన్యాయమని చెప్పే పరిస్థితి లేకపోవడం శోచనీయం.తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరందించే తుంగభద్ర డ్యామ్ పై భాగంలో కర్నాటక ఇప్పటికే ప్రాజెక్టులను నిర్మిస్తోంది. దీనిపై ఇప్పటికే ఒకింత ఆందోళన ప్రజల్లో ఉంది. తుంగభద్ర డ్యామ్ ఎగువ భాగంలో ప్రాజెక్టులు చేపడితే ఎప్పుడైనా వర్షాభావ పరిస్థితులు నెలకొంటే దిగువకు నీరొచ్చే పరిస్థితి ఉండదు. దీని వలన వర్షాభావ పరిస్థితుల సమయంలో తాగునీటి సమస్య జిల్లాలో ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉంది. ఇది నష్టం జరుగుతుందని తెలిసినా అధికార, ప్రతిపక్ష నేతలు మిన్నకుండటం గమనార్హం. సిపిఎం ఒక్కటే దీనిపై స్పందిస్తోంది. దీనిపై అన్ని రాజకీయ పక్షాలతోనూ సదస్సును నిర్వహిస్తోంది. కలిసొచ్చే వారితో పోరాటానికి సిద్ధమవుతోంది. ఇకపోతే కేంద్ర బడ్జెట్‌పై జిల్లాకు తీరని అన్యాయం జరిగిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కర్నాటకలో అప్పర్

భద్ర ప్రాజెక్టుకు రూ.5300కోట్లను వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. అదే పక్కనేవున్న రాయలసీమ జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలకు మాత్రం విభజన హామీలో ఉన్నా కేటాయింపులు మాత్రం శూన్యం.అంతకు మునుపు ఇచ్చే రూ.50 కోట్లు కూడా ఇప్పుడు ఇవ్వడం లేదు. కేంద్రీయ విశ్వవిద్యాలయంకు కూడా నిధులు నామ మాత్రంగానే కేటాయించారు. రూ47 కోట్లు నిధులు కేటాయించారు. ఇవి ఏ మూలకు సరిపోని పరిస్థితి నెలకొంది. గతేడాది కూడా రూ.56 కోట్లు కేటాయించి రూ.13 కోట్లు మాత్రమే మంజూరు చేశారు. ఇవి సాధారణ పరిపాలనకు సరిపోవు. ఇప్పటికే పలుమార్లు విద్యార్థులు మౌళిక సదుపాయలు లేవని ఆందోళనలు వ్యక్తం చేశారు. ఈ నిధులతో మౌళిక సదుపాయల కల్పన ఈ ఏడాదీ కల్పించే పరిస్థితులు లేవన్నది స్పష్టమవుతోంది. శాశ్వత బోధనా సిబ్బంది సైతం లేరు. రైల్వే బడ్జెట్‌లో గుంతకల్లు డివిజన్‌కు ప్రాధాన్యత లేదు. పాత లైన్లకు సైతం నిధులు కేటాయింపులు ఆశించినంత జరగలేదు. ఈ రకంగా కేంద్ర బడ్జెట్‌లో ప్రతి ఏడాది లాగానే ఈసారి నిధుల కేటాయింపుల్లో జల్లాకు తీరని అన్యాయం జరిగింది.దీనిపై పెదవి విప్పేందుకు అధికార,ప్రతిపక్ష పార్టీల నేతలెవరూ ముందుకు రాకపోవడం గమనార్హం.జిల్లా ప్రధాన సమస్యలపై ఒత్తిడి లేకపోవడంతో అధికార బిజెపి తనప్రాధాన్యతలకు అనుగుణంగా ఓట్లను దృష్టిలోపెట్టుకుని కేటాయింపులు జరుపుతూ ఉంది. వెనుకబాటు తనంపై రాయలసీమ డిక్లరేషన్‌ను ప్రకటించిన బిజెపి నాయకులు కూడా ఈ ప్రాంతానికి నిధుల కేటాయింపులు జరగకపోవడంపైనా స్పందించడం లేదు.

సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

బత్తలపల్లి : మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేద్దామని ఏపీ కురుబ కార్పోరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం తన స్వగృహంలో వాలెంటీర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బత్తలపల్లిలో ఈ నెల 8వ తేదీన ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యల గురించి వాలెంటీర్లతో ఆరా తీశారు. వాటి పరిష్కార మార్గాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కోటి సుధ. సర్పంచి ఆక్కిం కాశమ్మ, కో ఆప్షన్ మెంబర్ కరీంసాబ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు